క్లుప్తంగా

పేదలకు ఇంటి స్థలమివ్వాలి



వీఆర్‌ఓ ఓబులేసుకు వినతిపత్రం అందజేస్తున్న కుమ్మరవాండ్లపల్లి వాసులు

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓ ఓబులేసుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కుమ్మరవాండ్లపల్లిలోని 720 సర్వే నంబర్‌లో చాలా మంది పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వానికి మనసా ప్పడం లేదన్నారు. తమకు ఇంటి స్థలాలు ఇవ్వకపోతే దశలవారీగా ఉద్యమ బాటపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్మోహన్, సాంబశివ,బాబ్‌జాన్, భారతి, లక్ష్మీదేవి, పుష్ప, సరస్వతి, లక్ష్మి, మాబున్నీసా తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: కడపలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 20న జరిగిన సౌత్ ఇండియా ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కదిరి మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. ఎం.నికితాబాయ్ (డిగ్రీ విద్యార్థి) కుమితే విభాగంలో ప్రథమ స్థానం, కటా విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. 9వ తరగతి చదువుతున్న ప్రమేష్‌రాయల్ కటా విభాగంలో ప్రథమస్థానం, 8వ తరగతి చదువుతున్న విష్ణు,పావణి కటా విభాగంలో ప్రథమ స్థానం సాధించినట్లు కరాటే మాస్టర్ షెక్షావలి తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ అభినందించారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోండి



తాడిమర్రి కేజీబీవీలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

తాడిమర్రి: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆప్తాలమిక్ అధికారి ఉరుకుందప్ప విద్యార్థులకు సూచించారు. స్థానిక కేజీబీవీలో సోమవారం ప్రిన్సిపాల్ వాణిశ్రీ అధ్యక్షతన డాక్టర్ హరిత ఆధ్వర్యంలో 237 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్న 15 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. అనంతరం డాక్టర్ హరిత పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రక్తహీనత, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా తగినంత ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్త హర్షవర్దన్ రెడ్డి, ఏఎన్ఎం కోమలి, ఆశావర్కర్ నర్సమ్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపు



స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: భవిష్యత్తు శాస్త్రవేత్తల కోసం అంతరిక్ష విద్యా శిబిరం నిర్వహించడం శుభ పరిణామమని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష, ముస్కాన్ సహకారంతో నిర్వహించిన స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పాఠశాల విద్యార్థులకు టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటి, డ్రోన్లు, వివిధ రకాల రాకెట్స్ నమూనాలు, వాటి పని తీరు తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై వివరించారు. ప్రస్తుత కాలంలో సాంకేతికత ఎలా ఉపయోగిస్తున్నారో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. స్పేస్ ఎడ్యుకేటర్లు ముస్కాన్ సంస్థ అధికారి ప్రనేష్‌దేవనాథ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్‌లు విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆసక్తిని పెంపొందించారు.



ధర్మవరంలోని స్టేట్ బ్యాంక్ ముందు రహదారిపై పేరుకున్న చెత్త



పుట్టపర్తిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్త కుప్ప



పుట్టపర్తిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఇలా..

- సమ్మెలో డైలీవేజ్ కార్మికులు
- ధర్మవరం, పుట్టపర్తిలో పడకేసిన పారిశుధ్యం
- అటకెక్కిన చెత్త సేకరణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎక్కడి చెత్త అక్కడే

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఎటు చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తోంది. ప్రధాన రహదారుల పక్కన పెద్ద పెద్ద చెత్త దిబ్బలు కనిపిస్తున్నాయి. డైలీ వేజ్ కార్మికుల సమ్మెతో బ్యాంకు, పోస్టాఫీసు, కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, నేసేపేట, ఎరగుంట, ప్రియాంక నగర్, కొత్తపేట, దుర్గానగర్ ఇలా ప్రతి చోట చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారుల్లో వెళ్లే వాహనదారులు, ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధర్మవరం మున్సిపాలిటీలో పట్టణ పరిశుభ్రత కోసం కరోనా సమయంలో 87 మంది అడిషనల్ కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. డైలీ వేజెస్ ప్రకారం రూ.400 చెల్లిస్తూ గత ఐదు సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుత నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని పలుమార్లు కార్మికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ కౌన్సిల్‌లో పెట్టి వేతనాలు పెంచాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో సీఐటీయూ నాయకుల సహకారంతో గత మూడు రోజులుగా 87 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లారు.

కార్మికుల సమ్మెబాట

డైలీవేజ్ కార్మికులు 87 మంది కేవలం మూడు రోజులు సమ్మెలోకి వెళ్లగానే పట్టణంలోని ప్రధాన రహదారులన్ని చెత్త దిబ్బలుగా మారిపోయాయి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పారిశుధ్య కార్మికులు పట్టణంలోని 40 వార్డులతో పాటు ప్రధాన రహదారుల పక్కన డంపింగ్ అయిన చెత్తాచెదారాన్ని తొలగించేవారు. కాని వారు సమ్మెబాట పట్టడంతో రహదారులన్ని కంపు కొడుతున్నాయి.

జిల్లా కేంద్రంలో పేరుకుపోయిన చెత్త

పుట్టపర్తి టౌన్: సమస్యల పరిష్కారం కోసం పారిశుధ్య కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె బాట పట్టడంతో జిల్లా కేంద్రం చెత్తమయమైంది. ప్రధాన రహదారుల్లో చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణ వాసులు, సత్యసాయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెత్తను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు పెంచకపోతే ఉద్యమిస్తాం



మున్సిపాలిటీలో పట్టణ జనాభా ప్రాతిపదికన 400 మంది కార్మికులు అవసరమైతే కేవలం 253 మంది కార్మికులతో పనిచేయిస్తూ పనిభారం పెడుతున్నారు. వీరిలో 87 మంది డైలీవేజ్ కార్మికులు ఉన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా డైలీవేజ్ కార్మికులకు వేతనాలు పెంచాలి. మూడు రోజులు సమ్మెలోకి వెళ్లగానే పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం అధ్వానంగా తయారైంది. మున్సిపల్ కౌన్సిల్‌లో డైలీవేజ్ కార్మికులకు జీతాలు పెంచేలా పొందుపరిచి ఆమోదం తెలిపి వేతనాలు పెంచాలి. లేకపోతే కార్మికులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తాం.

– అయూబ్‌ఖాన్, సీఐటీయూ మండల కో–కన్వీనర్, ధర్మవరం

కార్మికులతో చర్చలు జరిపాం



డైలీవేజ్ కార్మికులు సమ్మెబాట పట్టారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఒకేసారి 87 మంది డైలీవేజ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో చెత్తను రోజూ తొలగించేందుకు కష్టతరంగా ఉంది. కార్మిక సంఘం నాయకులు, యూనియన్ నాయకులతో చర్చించాం. డైలీవేజ్ కార్మికులకు వేతనాలు పెంచేందుకు ఈ అంశాన్ని కౌన్సిల్ అజెండాలో పొందుపరుస్తాం. కౌన్సిల్ ఆమోదం తెలిపితే వేతనాలు పెంచుతామని కార్మిక సంఘం నాయకులకు హామీ ఇచ్చాం. సమ్మె విరమిస్తున్నారు. పట్టణంలో చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రమోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నల్లమాడ: మండలంలోని బాసంవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దుద్దుకుంట తిరుపాల్‌రెడ్డి సోమవారం మహిళలకు చీరలు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తన సతీమణి, నల్లమాడ సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ దుద్దుకుంట సునంద ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని వందమంది పేద మహిళలకు చీరలు, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 26 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, బలపాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పి. గోపాల్‌రెడ్డి, ఎం. మహేశ్వర్‌రెడ్డి, పరమేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డి మృతి తీరని లోటు



అశోక్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ యువనేత పడమల అశోక్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తాడిమర్రి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భవనేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి అనంతపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అశోక్‌రెడ్డి మృతదేహం సోమవారం మృతుడి స్వగ్రామం ఆత్మకూరుకు చేరింది. సమాచారం అందుకున్న వారు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులు పొడమల రామచంద్రారెడ్డి, అనంతమ్మను ఓదార్చి సంతాపం తెలిపారు. వైఎస్సార్‌సీపీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిపల్లి వెంకట నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి తలారి రాముడు, నాయకులు అల్లే సాయినాథ్‌రెడ్డి, రావులచెర్వు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

బత్తలపల్లి: అనంతపురం జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన సబ్ జూనియర్స్, జూనియర్స్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకట రాముడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీలు ఆగస్టు 24, 25, 26వ తేదీల్లో ప్రకాశం జిల్లాలో, జూనియర్స్ విభాగంలో సెప్టెంబర్ 12, 13, 14వ తేదీల్లో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలకు అనంతపురం జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఎంపిక పోటీలు జరిగాయన్నారు. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో జి.నవదీప్, బాలికల విభాగంలో బి.ప్రణిత, జూనియర్స్ బాలుర విభాగంలో ఎస్.ఇబ్రహీం, బి.ప్రదీప్, బాలికల విభాగంలో ఎ.చరిత, ఎస్.జస్వితలు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణప్ప, సంజీవులు, కేశవయ్య, చౌదరి, ఉపాధ్యాయులు అహ్మద్ జాన్, వరదరాజులు, బాలాజీ, శ్రీదేవి, పుష్పలత, ప్రమీల, షాహినా సుల్తానా బేగం, పద్మావతి, కామాక్షి, సుమలత తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



ఆశలన్నీ వరిపైనే

పోట్లమర్రి వద్ద సిద్ధంగా ఉన్న వరి నారు

రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోయినా బోరు బావుల కింద వరి సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. వరి నారు కోసం పది రోజుల క్రితం వరి విత్తనాలు చల్లారు. ఇప్పుడు నారు ఏపుగా పెరిగిపోవడంతో నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వర్షాభావంతో వేరుశనగ కేవలం పది శాతం రైతులు మాత్రమే పంట సాగు చేశారు. మిగిలిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎలాగో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట నిరాశ మిగిల్చేలా ఉందని భావించిన రైతులు.. వరి సాగుకు శ్రీకారం చుడుతున్నారు.

– బత్తలపల్లి:

మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం

ఓడీచెరువు: 'సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కి ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేస్తోంది. ఇందులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు'. అని జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని ఎంబీ క్రాస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఎన్నోరోజులు సాగదని, ఎల్లకాలం ఈ ప్రభుత్వమే అధికారంలో ఉండదన్నారు. అధికారులు కూటమి నాయకుల ఉచ్చులో పడకుండా జాగ్రత్త పడాలని హితవు పలికారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి కుర్లి నరసిరెడ్డి, ఎద్దుల హనుమంతరెడ్డి, ఆనందరెడ్డి, కుర్లి రంగారెడ్డి, వీరాంజి, సుకన్య, శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపే..

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి

కదిరి: రాజకీయ కక్ష సాధింపు కోసమే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న కొందరు ముఖ్య నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దెబ్బ తీయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ యత్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, రెడ్‌బుక్ రాజ్యాంగంపై ప్రజలు తిరగబడే రోజులు ఇంకెంతో దూరం లేవన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదర్‌రెడ్డి

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

చెన్నేకొత్తపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

యూరియా కొరత రానివ్వొద్దు

నల్లమాడ: రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతను ప్రభుత్వం నివారించాలని రైతు సంఘం నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మట్రా రాజశేఖర్, పి. చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ పట్టణంలో కూడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

టీబీపై అవగాహన ర్యాలీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని గరుగుతండాలో సోమవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. టీబీ వ్యాప్తి, లక్షణాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, ఛాతి నొప్పి, శ్వాస ఆడకపోవడం తదితర లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగవేణి, ఎంఎల్‌హెచ్‌పీ విజయకుమారి, ఆశా కార్యకర్త నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలను వైరల్ చేస్తే చర్యలు

హిందూపురం: హిందూపురంలో కొద్ది రోజులుగా సోషల్ మీడియాలలో వైరల్ అవుతున్న వీడియో అవాస్తవమని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. మోడల్ కాలనీ, ఆర్టీఓ ఆఫీస్ అండర్ బ్రిడ్జి దారుల్లో వాహనాల్లో వెళ్తున్న వారిపై దయ్యం దాడి చేసిందన్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఇలాంటి ఫేక్ వీడియోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో ఆయా ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతుంటారన్నారు. ఏదైనా అనుమానం వస్తే హిందూపురం 1టౌన్ సీఐ నంబర్ 9440796844, టూటౌన్ సీఐ నంబర్ 9440796845, రూరల్ సర్కిల్ సీఐ నంబర్ 9440796846, హిందూపురం యూసీఎస్ సీఐ నంబర్ 9440796847లకు తెలియజేయచ్చన్నారు.

ఇద్దరికి గాయాలు

హిందూపురం: మండలంలోని కగ్గల్లు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామ సమీపంలో గడ్డిమోపుతో సురేష్ ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన హనుమంతప్ప పరస్పరం ఢీ కొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



ముత్యాలమ్మ (ఫైల్)

బత్తలపల్లి: ధర్మవరం పట్టణం దుర్గానగర్‌కు చెందిన ముత్యాలమ్మ అలియాస్ దీపిక అదృశ్యమైంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం పట్టణం దుర్గానగర్‌కు చెందిన బోయ రాజా, ముత్యాలమ్మ అలియాస్ దీపిక ఆరు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇరువురి మధ్య మనస్పర్థలు వల్ల భార్యాభర్తలు వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రాజా తమ్ముడైన దుర్గాప్రసాద్ బత్తలపల్లిలో ఉంటున్న తన ఇంటికి ముత్యాలమ్మను పిలుచుకొని వచ్చి ఇరువురిని కలిపే ప్రయత్నం చేశాడు. ఈనెల 17వ తేదీన ఉదయం 11:30 గంటల సమయంలో రాజాకు ఆరోగ్యం సరిగా లేక బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి వెళ్లాడు. అదే సమయంలో ముత్యాలమ్మ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని ముత్యాలమ్మ తల్లికి దుర్గాప్రసాద్ ఫోన్ చేసి చెప్పాడు. ఆదివారం రాత్రి ముత్యాలమ్మ తల్లి ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

రక్షణ కల్పించండయ్యా..

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి రూరల్‌లోని కప్పలబండ పొలం సర్వేనంబర్ 266–1ఎలో తనకున్న 5.5 ఎకరాల పొలం ఆక్రమణకు గురైందని, న్యాయం చేయాలంటూ గూడా శ్రీనివాసులు కలెక్టర్ టీఎస్ చేతన్‌ను సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోరారు. ఆర్మీలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన తన తండ్రి వెంకటేసులుకు ప్రభుత్వం 1979లో పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చిందన్నారు. ఖాతా నంబర్ 500 గా రికార్డుల్లో రెవెన్యూ అధికారాలు నమోదు చేశారన్నారు. అయితే తమకు తెలియకుండా అగ్రహారం కిష్టప్ప అనే వ్యక్తి భూమిని ఆక్రమించుకుని, రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారన్నారు. ఆర్డీఓ రద్దు చేసిన తరువాత తాము ఆ పొలాన్ని సాగు చేస్తుంటే కిష్టప్ప దౌర్జన్యం చేస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని గూడా శ్రీనివాసులు కలెక్టర్‌ను అభ్యర్థించారు.

అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

రొళ్ల: విద్యుత్ మీటర్లు లేకుండా అనాధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్‌శాఖ విజిలెన్స్ డీఈ వివేకానందస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ ఏఈ నిజాముద్దీన్‌తో కలిసి పర్యటించారు. స్థానిక వాటర్ వర్స్క్ బోరుబావి, అంగళ్లు, హార్డ్‌వేర్ షాపులు, కుటీర పరిశ్రమలు, గృహ వినియోగదారులతో పాటు పిండి మిషన్లు యజమానులు తదితరులు విద్యుత్ కనెక్షన్లు పొంది ఇది వరకే అమర్చిన విద్యుత్ మీటర్లను పరిశీలించారు. తొలుత విద్యుత్ మీటర్ల వినియోగానికి సంబంధించిన రీడింగ్ సక్రమంగా చూపిస్తున్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఈ వివేకానందస్వామి మాట్లాడుతూ వ్యవసాయ బోరుబావులు కలిగిన రైతులు తప్పనిసరిగి సర్వీస్ చార్జ్ కింద ప్రతి నెలా రూ.30 చెల్లించాలన్నారు. వాణిజ్య, వ్యాపార లావాదేవీల సముదాయాలు, అంగళ్లు యజమానులు ఎవరైనా మీటర్లు లేకుండా అనాధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ లైన్‌మాన్ నరసింహమూర్తి, విజిలెన్స్ కానిస్టేబుల్ లక్ష్మీకాంత్, విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




బోరుబావికి ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఈ వివేకానంద స్వామి

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

ప్రశాంతి నిలయం: భూ వివాదంలో తమకు అనుకులంగా పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని పుట్టపర్తి ఆర్డీఓ ఇచ్చిన ఉత్తర్వులను గోరంట్ల తహసీల్దార్ లెక్కచేయడం లేదు. పాసు పుస్తకం మంజూరు చేయడంలేదు. వెంటనే తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని గోరంట్ల మండలం పులేరు మజరా పరిధిలోని మర్రెడ్డిపల్లికి చెందిన లక్ష్మీనరసమ్మ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆమె వివరాలమేరకు.. గోరంట్ల గ్రామ పొలంలో సర్వే నంబర్ 616–1లో 4.12 ఎకరాలు, సర్వే నంబర్ 608–2సీలో 12–02 ఎకరాల పొలం తన అమ్మ జీలం నారాయణమ్మ నుంచి తనకు సంక్రమించిందని లక్ష్మీనరసమ్మ తెలిపారు. 1975 తనకు అర్ధభాగం, తన పెదనాన్న జీలం నరసప్ప కుమారులకు అర్ధభాగం సంక్రమించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అయితే మొత్తం ఆస్తి పెదనాన్న కుమారుల మీదే పాసుపుస్తకం చేశారని, ఇదే వ్యవహారంపై పుట్టపర్తి ఆర్డీఓ కోర్టులో ఆర్ఓఆర్ అప్పీలు చేసి వారి పట్టాదారు పాసుపుస్తకం రద్దు చేయాలని ఆర్డీఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే వాటిని అమలు చేయకుండా గోరంట్ల తహసీల్దార్ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చెత్త ఆలోచన.. వాహనాలు మూలన





పంచాయతీ కార్యాలయంలో మూలనపడేసిన చెత్త సేకరణ వాహనాలు

పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీలకు చెత్త సేకరణ వాహనాలను కేటాయించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి నిర్వహణను గాలికొదిలేసింది. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాల్సిన పంచాయతీ కార్మికులు కేవలం.. బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో చెత్తను తొలగిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. చెత్త సేకరణకు కేటాయించిన వాహనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సదరు వాహనాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో చెత్త పాలైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆటోలను పంచాయతీ కార్యాలయంలో ఓ మూలన పడేయడంతో తుప్పు పట్టి పాడైపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– బత్తలపల్లి: